
# బిజినెస్ సీక్రెట్



ఆదివారం ఆఫీసుకి సెలవు కావటాన ఇంట్లో ఏం తోచక అలా పవర్‌పేటవైపు బయలుదేరి నా మిత్రుడి దుకాణం చేరుకున్నాను. నా మిత్రుడు శేఖరం అక్కడో కిళ్ళీషాపు నడుపుతున్నాడు. అందులో వార, మాస, దినపత్రికలు కూడా దొరుకుతాయి (తెలుగువే అనుకోండి). కిళ్ళీలతోపాటు అన్ని రకాల 'బ్రాండ్'ల సిగరెట్లు సైతం జోరుగా, హుషారుగా అమ్మకం చేస్తాడు మావాడు శేఖరం. శేఖరం, నేను పదో తరగతిదాకా ఒకే స్కూలులో, ఒకే క్లాసులో సహాధ్యాయులం. వాడు పదోక్లాసు రెండుసార్లు తప్పి, ఆపై ఇంక చదివే ఓపిక లేకనో, వాళ్ళ నాన్నకి చదివించే స్తోమత లేకనో అర్జెంటుగా పవర్‌పేటలో కిళ్ళీ కమ్ పుస్తకాల షాపు తెరచేసి 'దిగ్విజయం'గా నడుపుకొస్తున్నాడు.

చదువులో కాస్త వెనుకంజవేసినప్పటికీ, వ్యాపారంలో ఘటికుడనేనని నలుగురిచేత అనిపించుకున్నాడు. మా ఇద్దరి దారులు, వృత్తులు వేరైనా, స్నేహితులం కాబట్టి అప్పుడప్పుడు వాడి షాపుకెళ్ళి అక్కడ పుస్తకాలూ అవీ తిరగేస్తూ, మాట్లాడుతూ, సిగరెట్లు పీలుస్తూ, కిళ్ళీ నములుతూ శేఖరంతో మాట్లాడి వస్తుంటాను నేను. నేను వెళ్ళేసరికి వాడు బిజీగా వున్నాడు. ఎవరికో గబగబా నాలుగు కిళ్ళీలు కట్టి, మరో మూడు పత్రికలు వేరే వారికిచ్చి, వారిచ్చిన డబ్బు తీసుకుని, ఇవ్వాల్సిన చిల్లర ఇచ్చేసి నన్ను చూసి "రా గురూ ఏమిటిలా వచ్చేశావ్?" అంటూ కూర్చో అన్నట్టు అక్కడున్న చిన్న బెంచీ చూపెట్టేడు. అక్కడ కూర్చుని, వాడ్ని వ్యాపారం ఎలా వుందని కుశల ప్రశ్న వేసేను.

బ్రహ్మాండంగా వుందన్నాడు. ఇంతలో ఒక వ్యక్తి దుకాణం దగ్గరకొచ్చి, ఒక సిగరెట్టు పెట్టె ఇమ్మని పదినోటు ఇచ్చేడు. ఆ వ్యక్తి హుందాగా, ఖరీదైన దుస్తులతో దర్జాగా వున్నాడు. మావాడు సిగరెట్ పాకెట్ ఇచ్చి, ఐదు రూపాయిలు తిరిగి ఇస్తూ, "రెండ్రూపాయిల చిల్లర తక్కువైంది సార్" అని, "పోనీ రెండ్రూపాయిలకు ఇంకేమైనాతీసుకుంటారా?" అని, "కొత్త పత్రిక వచ్చింది సార్, చాలా బాగుంది" అని చూపించాడు. ఆ వ్యక్తి "సరే ఇవ్వు" అంటూ ఆ రెండ్రూపాయిలకు బదులుగా ఆ పత్రిక పట్టుకుని వెళ్ళిపోయాడు. నేను శేఖరాన్ని అడిగేను "నీ దగ్గర నిజంగా చిల్లర లేదా? ఇంతమంది వచ్చిపోతున్నారు కదా? సేల్స్ బాగా వుంటాయి కదా?" అని. శేఖరం "మనిషిని బట్టి వ్యాపారం చేస్తే బాగా సంపాదించొచ్చు."

"ఇప్పుడొచ్చిన అతను మంచి శ్రీమంతుడు. మంచి ఖర్చుదారుడు. తనకి సిగరెట్ పెట్టె అవసరం. కాని, అదిచ్చి చిల్లర లేదంటే, ఆ తక్కువైన చిల్లర బదులు పత్రిక తీసుకోండి అనగానే తీసుకున్నాడు. నిజానికి నా దగ్గర చిల్లరున్నా ఆ పత్రిక కొనిపించడం కోసం చిల్లర లేదన్నాను. అతను పత్రిక కొనడంవల్ల నాకు క్షణంలో యాభై పైసల కమిషన్ లాభంగా వచ్చింది. ఇలా అబద్ధం ఆడడంవల్ల అతనికి నష్టం ఏం లేదు నా వల్ల.

"ఆయనకి కొనే స్తోమత వుంది కదా అని వెంటనే కొన్నాడు. భుక్తికోసం వ్యాపారరీత్యా అలా చిన్న చిన్న చిట్కాలు చేయడం మాకు మామూలే. అందువల్ల ఎవరికీ నష్టంలేదు. ఇదే పేదవాడైతే రెండ్రూపాయిలు పెట్టి అంత వెనక ముందూ చూడకుండా కొనడు కాబట్టి, తప్పని సరిగా సిగరెట్ పాకెట్ ఇచ్చి, చిల్లర కూడా మిగతాది వాపసు ఇచ్చి వుంటాను. ఇంకేదైనా కొనమన్నా ఆ వ్యక్తి కొనలేడు కాబట్టి" అన్నాడు. మొత్తానికి శేఖరం ఘటికుడే!

చదువులో కాకపోయినా, జీవితంలో మంచి హుషారు, తెలివి ప్రదర్శిస్తున్నాడని నాకు అన్పించి మనసులోనే మెచ్చుకున్నా వాడ్ని. వాడు చేసేది వ్యాపారమే ఐనా, ఒకరిని మోసం చేయకుండా, మనిషి స్తోమతని, స్వభావాన్ని అంచనాకట్టి తనకి లాభం కలిగినా, ఎదుటి మనిషిని దోచకుండా తెలివిగా, సమంజసంగా సమయస్ఫూర్తిని చూపెట్టి నొప్పించక తానొవ్వక అనే రీతిలో చేస్తున్నాడనుకుని "మంచి వ్యాపారవేత్తవేనోయ్" అని కితాబిచ్చేను.

—ఎస్. వెంకటరవీంద్ర

---

"మయూరాక్షి? నేను నీకు సహాయం చేస్తాను. విషయం సమగ్రంగా చెప్పు..."

"చెప్పడానికేముంది. నా భర్తకు ప్రమోషన్ కావాలి. అతను స్టోరు ఇష్యూవరుగా వున్నాడు. గుమస్తా ఉద్యోగం ఒకటి ఖాళీ అయింది. దానికి సీనియారిటీలో ఇతను ఆరోవాడు. ఇతని టర్నుకి మరో రెండు సంవత్సరాలు పడుతుంది."

"అందుకోసమని పెళ్ళాన్ని రాయ్ దగ్గిరికి పొమ్మన్నాడా?"

"అవును, రావు బాబూ!"

"ఇది చాలా అన్యాయం. నీ భర్త ఇంత దౌర్భాగ్యుడని నేననుకోలేదు."

"చాల మంది పెద్ద మనుషులే ఇలాంటి పనులు చేశారు."

"మయూరాక్షీ! దాగుడుమూతలు ఎందుకు? విషయం చెప్పు."

"వినే తీరిక నీకుందా?"

"మయూరాక్షి ఏది చెప్పినా వింటాను."

"నేను బోల్‌పూర్ శాంతినికేతనంలో ఎమ్మే పాస యాను. అంత తెలివి తేటలు లేకపోతే ఒక ప్రొఫెసరు గారింటికి పాఠాల కోసం వెళ్ళేదాన్ని. ఆయన చాలమంచి వాడే! సందేహంలేదు. కాని అతనికో బావమరిది వుండేవాడు చాల తెలివైన వాడు. నాకు సెకెండు క్లాసు ఇప్పిస్తానని మోసం చేశాడు. అది వాడి వృత్తి. మరేం చేయను."

"డామిట్"

"తరువాత ఉద్యోగమిప్పిస్తానని మరోడు డబ్బు తిన్నాడు. నన్నూ విడిచి పెట్టలేదు."

"వెధవ!"

"తరువాత- నా తల్లి దండ్రులు -వాళ్ళేం చేస్తారు! బీదవాళ్ళు- వాళ్ళు నా జీతం రాళ్ళతోనే సంతోషించారు. ఎంతమందో పెళ్ళి చేసుకోవాలని వచ్చినా, వెనక్కు పెట్టారు- నాతోపాటు వాళ్ళ బ్రతుకు వెడుతుందని"

"మరీ దౌర్భాగ్యుడెలా జతపడ్డాడు?"

"నేను తెచ్చే జీతంలో సగానికి ఒప్పుకున్నాడు. అట్టే డబ్బు కూడా కట్నం పుచ్చుకోలేదు."

"అయితే కొంతలో కొంతమంచివాడే"

"ఏం మంచి! అతనికి నన్నెట్లా వినియోగించుకోడమో తెలుసు."

"అంటే?"

"ఆ రోజు నన్ను తనే నీ దగ్గిరికి పంపించాడు. ఉద్యోగం చిన్నదైనా వ్యసనాలకు లోటుండదు కదా! నువ్విచ్చిన డబ్బులు నెల్లాళ్ళు తాగాడు."

"రాస్కెల్!"

"రావ్ బాబూ! ఇప్పుడీరాయ్ దగ్గిరికి పోయి ప్రమోషను తెమ్మంటున్నాడు."

"ఓ మయూరాక్షీ! నువ్వీ పనిచేయడానికి వీల్లేదు."

"మరేం చెయ్యడం?"

"ఏం చెయ్యడమో నాకు తెలుసు. వాడిని కొనేస్తాను. డబ్బే వాడికి కావాలి. మిగిలిన దంతా వేషం. నీ భర్తకు వారంరోజుల్లో ప్రమోషను తెప్పిస్తున్నానని చెప్పు."

"నిజమా, రావు బాబూ!"

ఆమె ఏడ్చింది. ఆ ఏడుపునుంచి తేరుకొంది. తరువాత నవ్వింది. తరువాత ఒంటికి కట్టిన పుట్టాలు విప్పుకొంది.

"ఇదెందుకు?"

"నీ దగ్గిర నాకు బిడియం లేదు"

రావు బాబు ఆమెను చేతుల్లోకి తీసుకొని అన్నాడు.

"బట్టలు వేసుకో! నువ్వు నాకు హృదయ మిచ్చావు. ఈ శరీరం దేనికి! నువ్వు నా ప్రాణానివి. నా దేవతవి మయూరాక్షీ!"